

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాపక్షం/ధన్వాడ : ధన్వాడ మండల కేంద్రంలో కోటపక్క క్రికెట్ టోర్నమెంట్ సీజన్ వన్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి గ్రామ ఉపసర్పంచ్ పూజారి నరసింహ మాజీ వైస్ ఎంపిపి పి.రామచంద్ర వారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు సుంకు ఉమేష్ కుమార్ మాజీ ఎంపిటిసి బహుమతి వితరణకు గాను టోర్నమెంట్ మొత్తానికి సంబంధించిన క్రీడ సామాగ్రి రాష్ట్ర బీజేవైఎం నాయకుడు సి.ప్రవీణ్ కుమార్ రెడ్డి అందించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసికంగా ఎంతో ఉత్సాహాన్ని వర్తింపచేస్తావని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కురువ మల్లేష్, టప్పు భాస్కర్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల శ్రమ వెలకట్టలేనిది



ప్రజాపక్షం/పెబ్బేరు : పట్టణాన్ని స్వచ్ఛ భారత్‌లో ముందుంచేందుకు కార్మికులు పడుతున్న శ్రమ వెలకట్టలేనిదని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం తరపున కేటాయించిన సబ్బులు, నూనెలను వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు పంపిణీ చేశారు.

## విగ్రహ ఏర్పాటుకు విరాళాల సేకరణ



ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పళ్ళ పోల్కమ్మ అమ్మవారి ఆలయం వద్ద పూజలను చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ మహోన్నత కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విగ్రహ ఏర్పాటు కోసం సహకరించాలని కోరారు. విరాళాల సేకరణ కార్యక్రమ ప్రారంభం సందర్భంగా జి.కురుమన్న, జి.శేషయాదవ్, శ్రీపాద్ కులకర్ణిలు ఒక్కొక్కరు రూ.1 లక్ష చొప్పున విరాళం అందించారు. అలాగే సంకలపురం మల్లేష్ రూ.51 వేలు అందించగా భీష్మరాజ్ పౌండేష్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల చెక్ అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, రఘురామయ్య గౌడ్, కన్న శివకుమార్, పళ్ళ రఘు, పావడి మహాదేవ్, హోటల్ నవీన్, మణిశంకర్, జుట్టు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి మరణం తీరని లోటు



ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ పట్టణ పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన దండు చెన్నా రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, వారిలో భరోసా నింపేందుకు చిన్న నాటి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. 2004–05 ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన చెన్నారెడ్డి అకాల మరణం వారి స్నేహితులను తీవ్రంగా కలిచివేసింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో అదే బ్యాచ్‌కు చెందిన మిత్రులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మరణించిన మిత్రుని నివాసానికి చేరుకున్న స్నేహితులు, బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం తమ వంతు సహాయంగా సేకరించిన రూ. 50 వేలు నగదును చెన్నా రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ఆపదలో ఉన్న స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/పానుగల్ : పానుగల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామానికి చెందిన గడమాల శివకుమార్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా, అతని 2009–10 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచారు. వాటి స్నేహితులంతా కలిసి పోగుచేసిన రూ.43 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న స్నేహితుని ఆదుకున్న ఈ యువకులను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. విక్రమ్, నరిసింహా వెంటేష్, రాధా తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్ అందజేత



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మండలం పాలెం గ్రామంలో వివేకానంద క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కి ముఖ్య అతిథిగా హైకోర్టు అడ్వకేట్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల మందడి సరోజ్ రెడ్డి విచ్చేసి వివేకానంద క్రికెట్ క్లబ్ సభ్యులకు క్రికెట్ కిట్‌తో పాటు రూ.10,000 అందజేశారు. ఈ సందర్భంగా సరోజ్ రెడ్డి మాట్లాడుతూ యువత చదవుతో పాటు క్రీడా రంగంలో ముందుండాలని, ఏ సమస్య ఏదైనా పరిష్కరించే దిశగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకుల సరోజ్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

# యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### జెఏసి చైర్మన్ డా.దాసరి అజయ్ కుమార్



ప్రజాపక్షం/సోమాజిగూడ : రాష్ట్రంలో యాదవ సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధికి యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి,బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని యాదవ జెఏసి చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన యాదవ మేధావుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవులను చిన్నచూపు చూస్తున్నదని మండిపడ్డారు. యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. నామినేటెడ్ పదవులలో యాదవులకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. యాదవులకు గతంలో ఉన్న ఎస్ఎన్‌టి రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కోకాపేటలోని యాదవ ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బిపిమండల్ సిఫారసులను అమలు చేయాలని, లేనిపక్షంలో మరో మండల్ ఉద్యమం చేపడుతామని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో జెఏసి చైర్మన్ చిలుకల శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు సిద్ధి రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు బెల్లి చంద్రశేఖర్, గంగుల మధు, మేకల శివశంకర్ , లీగల్ సెల్ కన్వీనర్ పొన్నం రవీందర్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి యాదవ్, డాక్టర్ శ్రీనివాస్, నక్క ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## స్త్రీ శక్తి అవార్డుల ప్రదానం

ప్రజాపక్షం/చిక్కడపల్లి: అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్త్రీ శక్తి అవార్డులను ప్రదానం చేశారు. డా.పద్మా కమలాకర్, డా. మాధురి గోపాల్, డా.పూనమ్ నోముల్వార్, పి.గౌతమి, ఏ.లలిత తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫుడ్, గేమ్స్, తంబోలా పోటీలు, జ్యూస్, మెహందీ స్టాల్స్ ఏర్పాటు చేశారు.



## వీరబ్రహ్మ గురుబోధామృతం గ్రంథావిష్కరణ

ప్రజాపక్షం/చిక్కడపల్లి: వీరబ్రహ్మ గురుబోధామృతం గ్రంథావిష్కరణ విద్యానగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ధర్మపీఠం సభాపతి ఆచార్య త్రిమూర్తుల గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా 'మహోపాధ్యాయ' కందిమల్లాయపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆస్థానకవి డా.పెదపాటి నాగేశ్వరరావు, సంస్కృత పండితుడు ఎర్రోజు లక్ష్మణాచార్యులు, పండితుడు డా.కొల్లోజు కనకాచార్యులు, గార్లపాటి గురుబ్రహ్మాచారి విచ్చేశారు. దైవ ప్రార్థన అనంతరం అతిథులకు సంచాలకుడు శివానందం ఆహ్వానం పలుకగా.. అధ్యక్షుడి తొలిపలుకుల తరువాత సభలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి విరచిత సిద్ధ గురుబోధ 55 పద్యాలకు ఏలూరి నాగేంద్ర స్వరూపసాగర్ రచించిన ఆధ్యాత్మిక వ్యాఖ్యాన గ్రంథం శ్రీ వీరబ్రహ్మ గురుబోధామృత స్వరూపమ్, ఆచార్య సిద్ధాంతి రూపొందించిన పరాభవ నామ నూతన సంవత్సర (2026–2027) పంచాంగములను డా. పెదపాటి, నాగేంద్రస్వరూప సాగర్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎర్రోజు లక్ష్మణాచార్యులు వీరబ్రహ్మేంద్ర గురు బోధామృత స్వరూపమును విశ్లేషించారు. కార్యక్రమంలో కొండపి వెంకటగణేష్‌బాబు, డా.మారోజు నరసింహాచార్య, కపిలవాయి అశోక్‌బాబు, బొజ్జా లక్ష్మణసేన తదితరులు పాల్గొన్నారు.

# స్రీనిధియన్స్ వాక్ ఫర్ ఏ కాజ్



ప్రజాపక్షం/ఖైరతాబాద్: చిన్నారుల విద్యాభివృద్ధి, సంతోషకరమైన బాల్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తున్న విద్యార్థుల ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థ బచ్పన్ ప్రయాస్ ఆధ్వర్యంలో స్రీనిధియన్స్ వాక్ ఫర్ ఏ కాజ్ కార్యక్రమం ఆదివారం ఉదయం సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్‌లో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో బచ్పన్ ప్రయాస్ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ప్రతి చిన్నారికి విద్యా అవకాశాలు అందాలని, ఆనందకరమైన బాల్యం కలగాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వాక్ ఫర్ ఏ కాజ్ కార్యక్రమం ద్వారా సేకరించిన విరాళాలను పలు సామాజిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్ట్ విక్సారా ద్వారా గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ప్యూరిఫైయర్లను అందించడం, ప్రాజెక్ట్ పునర్నిర్మాణ్ ద్వారా బాలికల కోసం పాఠశాలల్లో శౌచాలయాల పునర్నిర్మాణం, అలాగే ప్రాజెక్ట్ డిజి విజ్ఞాన్ ద్వారా డిజిటల్ విద్యకు సహకరించే ప్రొజెక్టర్లను ప్రభుత్వ పాఠశాలలకు అందించడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వ కార్తికేయ విద్యార్థుల సేవాభావాన్ని ప్రశంసించారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని ఆయన ప్రోత్సహించారు. ఒక చిన్న అడుగు కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందనే సందేశాన్ని ఈ వాక్ కార్యక్రమం ద్వారా పాల్గొన్న వారికి అందించారు.

## కామెడీ షో 'మాస్ జాతర'



ప్రజాపక్షం/బంజారాహిల్స్: తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించేందుకు జెమినీ టీవీ సిద్ధమైంది. 'మాస్ జాతర' పేరుతో రూపొందించిన మెగా వీకెండ్ కామెడీ షోను ఆదివారం నెక్సస్ మాల్‌లో సినీ తారలు, కమెడియన్ల సందడి మధ్య ఘనంగా ప్రారంభమైంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్, యూట్యూబర్లు, కళాకారులతో కూడిన ఈ వినూత్న స్కిట్ కాంపిటీషన్ ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి తొమ్మిది గంటలకు ప్రసారం కానుంది. నవదీప్, జానీ మాస్టర్, బిందు మాధవి జడ్జీలుగా వ్యవహరిస్తున్న ఈ షోకు దీపికా పిల్లి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. వీకెండ్ ఈవెనింగ్ వేళల్లో కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యంగా కళాకారులు అందించే వినోదాల విందు ఈ 'మాస్ జాతర'. ఇది కేవలం పోటీ మాత్రమే కాదు, ఇదొక హాస్యపు వేడుక. ప్రతి ఇంటా నవ్వులు కురిపించేందుకు జెమినీ టీవీ ఈ మెగా వీకెండ్ షోను మన ముందుకు తెచ్చింది. నిన్నటి వరకు స్మార్ట్ ఫోన్ తెరలకే పరిమితమైన ప్రతిభ, ఇకపై బుల్లితెరపై విశ్వరూపం చూపిస్తూ మీ వీకెండ్స్‌ను మాస్ లెవల్లో ఎంటర్‌టెయిన్ చేయనుంది.

## పారా అథ్లెటిక్స్ డిస్కస్‌త్రోలో కాంస్యం



ప్రజాపక్షం/అబిడ్స్: న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీ 2026'లో పారా అథ్లెట్ జ్యోతి అద్భుత ప్రదర్శన కనబరిచారు. న్యూఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ ఈవెంట్లో మహిళల డిస్కస్ త్రో (ఎఫ్57 విభాగం)లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) మద్దతుతో రాణిస్తున్న జ్యోతి రాబోయే ఆసియా పారా గేమ్స్, పారాఒలింపిక్స్ సిద్ధమవుతున్న క్రమంలో ఈ విజయం కీలక మైలురాయిగా చెప్పవచ్చు. ప్రతిష్టాత్మక ప్రపంచ పారా అథ్లెటిక్స్ లో పతకం సాధించడం ద్వారా ఈ విభాగంలో సత్తా చాటారు.



## 2.44 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాపక్షం/మలక్‌పేట్: గంజాయి విక్రయాలకు పోలీసులు చెక్ పెట్టారు. ఈ మేరకు మలక్‌పేట్ అబ్కారీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో గంజాయి అమ్మకాలు జరుగుతున్న సమాచారం అందింది. వెంటనే ఎస్‌టీఎఫ్‌ఏ బృందం అధికారి అంజిరెడ్డి సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 359గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో గంజాయి ప్యాకెట్ ఆరునుంచిఏడు గ్రాములుగా ఉంది. మొత్తం పాకెట్లను తూకం వేయగా 2.44 కేజీల గంజాయిగా ఉన్నట్లు గుర్తించి నిందితుడు సయ్యద్ మన్నన్(31) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో అక్రూర్‌ఖాన్‌పై కూడా కేసు నమోదు చేసినట్టు అంజిరెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు సన్మానం



ప్రజాపక్షం/జూబ్లీహిల్స్: కాంగ్రెస్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ తొలిసారిగా విజయవాడకు విచ్చేసిన సందర్భంగా యాదవ ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీతో నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్గమధ్యంలో గజమాలలు వేసి బంతిపూల వర్షం కురిపించి ఆయనను అభిమానులు, యాదవ సంఘాల నాయకులు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. తనకు సన్మాన సభ ఏర్పాటు చేసిన యాదవ ఐక్యవేదిక సంఘాల నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రజాపక్షం/కంటోన్మెంట్: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మోండా మార్కెట్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కంటోన్మెంట్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్.. జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీసులు, ఆరోగ్య శాఖ, జలమండలి అధికారులతో కలిసి ప్రజలు ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల రహితంగా డివిజన్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గణేష్ వివరించారు.

## 21న మా భగవతి విశాల్ జాగరణ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం విలువలను పెంపొందించేందుకు నాంపల్లిలోని ఎక్షిబిషన్ గ్రౌండ్స్ లో ఈ నెల 21 న 'మా భగవతి విశాల్ జాగరణ్' ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్, హైదరాబాద్ కోర్ కమిటీ ప్రకటించింది. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటి నేతలు సభ్యులు రామ్ కిషన్ అగర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్‌పురియా, సంజయ్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, రాకేష్ జలాన్, , సూర్యకమల్ జి పుత్రా, అంజనీ కుమార్ సరోగి మాట్లాడుతూ, జాగరణ్ కార్యక్రమంలో సుమారు 20,000 మంది భక్తులు హాజరవుతారని, ఉచిత ప్రవేశం, ఫలహారాలు, విందు, 'ప్రసాదం' జాగరణకు హాజరయ్యే భక్తులకు ఉచితంగా పంపిణీ చేయబడుతుందని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందుతారని వారు తెలిపారు. తల్లి భగవతి ఆస్థానంలో అఖండ జ్యోతి, మహాసభ, అతీంద్రియ దర్శనం, భజన గంగా, మాత నిధి, తారా రాణి కథ, ఆర్తి వంటివి జరుగుతాయని వారు తెలిపారు.

## మొబైల్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్

ప్రజాపక్షం/పంజాగుట్ట: మొబైల్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వీరిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. అరెస్ట్ అయిన వారిలో అజయ్‌కుమార్, నందేశ్వర్, సాకిబ్, అమీర్ నవాజ్, అబ్దుల్ షోహాన్‌తో పాటు ఒక బాల నిందితుడు ఉన్నాడు. వారి నుంచి 10 మొబైల్ ఫోన్లు, పల్సర్ ఎన్ఎస్ 200 బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ గ్యాంగ్‌పై పంజాగుట్ట, దోమలగూడ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

## కాంగ్రెస్‌లోకి పోలికేపహాడ్ సర్పంచ్



ప్రజాపక్షం/గోపాల్‌పేట : గోపాల్‌పేట మండలం పోలికేపహాడ్ గ్రామ పంచాయతీ ఇండిపెండెంట్ సర్పంచ్ బంగారయ్య, ఉప సర్పంచ్ బపన్న వార్డు మెంబర్లు, గ్రామానికి చెందిన 60 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పోలికేపహాడ్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చేరిక కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పోలికేపహాడ్ గ్రామ అభివృద్ధికై, నేడు ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికీ లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులమై మేఘారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు నచ్చి, నేడు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారయ్య, ఉప ఉప సర్పంచ్ జంపన్నతో పాటు గోపాల్ పేట మండల ఇంచార్జ్ సత్యశిలా రెడ్డి వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి ఎమ్మెల్యే రూ.2 లక్షల విరాళం

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండలం తోమాలపల్లి ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘారెడ్డి వ్యక్తిగతంగా రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆయన తన ఉదారతను చాటుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనుల కోసం తన వ్యక్తిగత నిధుల నుంచి రూ.2 లక్షల నగదును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి పెద్ద మొత్తంలో విరాళం అందజేయడంపై పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్ సర్పంచ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, గ్రామ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంగన్న యాదవ్ తో పాటు గ్రామ ప్రజలు ఆలయ మండలి హర్షం వ్యక్తం చేసింది.

# ప్రభుత్వ అసమర్థత వల్లే సాగునీటి రంగం అస్తవ్యస్తం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, పాలనలో పాదర్శకత కరువైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రైతు భరోసా కోసం రూ.9 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయని చెబుతూనే, మూడు సీజన్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారు. సకాంలో కరెంటు, యూరియా సరఫరా చేయలేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయి. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థతే అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శ్రీధర్ రెడ్డి, హత్య కేసుపై అల్టిమేటం వాకిటి శ్రీధర్ రెడ్డి హత్య కేసు జరిగి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ నిందితులను తేల్చకపోవడం దారుణమన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారకూడదని, వారం రోజుల్లో ఈ కేసును ఛేధించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అసంపూర్తిగా అభివృద్ధి పనులు వనపర్తి పట్టణంలో మున్సిపల్ పాలన పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. బైపాస్ రోడ్డు కేసీఆర్ హయాంలో రాజపేట నుండి పానగల్ రోడ్డు వరకు ప్రారంభించిన అర్ధ చంద్రకార బైపాస్ రోడ్డు పనులను నేటి పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, లక్ష్యారెడ్డి, ఎద్దుల, కరుణ శ్రీ, కృష్ణా నాయక్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ జిల్లా జిహెచ్ఎంసి పరిధిలోని రాంపల్లి దాయర వెంకులోని గుట్ట హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు వేయించండి

### ఎంపి ఈటలకు బిజెపి నేతల విన్నపం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం నుండి జీడిమెట్ల సబ్ స్టేషన్ వరకు రహదారిని వేయాలని కోరుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ జాతీయ రహదారి నుండి దూలపల్లి మీదుగా జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా షాపూర్ నగర్, ముంబాయ్ జాతీయ రహదారికి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ఇట్టి రోడ్డు పూర్తిగా గుంతల మయంతో అధ్వాన్నంగా మారిందని ఈటలకు శేఖర్ వివరించారు. గుంతలమయంగా మారిన ఈ రహదారిలో ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అంతేకాకుండా పారిశ్రామికవాడలోని పరిశ్రమలలో పనిచేసేందుకు ఉదయం, సాయంత్రం లక్షలాదిమంది కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఈ పరిశ్రమల నుండి లక్షలాది రూపాయలు ఇంటి పన్నులు, జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, కనీస అవసరాల నిమిత్తం ఈ రోడ్డుని అభివృద్ధి చేయకుండా వదిలేశారని అన్నారు. ప్రజలు, పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రోడ్డుని, డ్రైనేజీ వ్యవస్థని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నేతలు రావుల శేషగిరి, గిరివర్ధన్ రెడ్డి, కట్ట కుమార్, శ్రీహరి, నాగరాజు పాల్గొన్నారు.



## ఘనంగా 214వ వారం జ్ఞానమాల

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్ఞానమాల 214వ వారం జ్ఞానమాల వైభవంగా ఆదివారం జరిగింది. అంబేద్కర్ విగ్రహనికి జ్ఞానమాల సమర్పించిన సామాజిక కార్యకర్త సన్నాల బాబాచారి మాట్లాడుతూ మాన్యశ్రీ కాన్షీరామ్ బహుజనులకు ఆత్మగౌరవం, రాజకీయ ప్రాముఖ్యతను కల్పించిన మహనీయుడని అన్నారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రెగణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ సభ్యులు నిర్వహిస్తున్న జ్ఞానమాల మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తిరుపతి, మహేష్, సుమన్‌బన్నీ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫాల పంపిణీ

**ప్రజాపక్షం/కాప్రా :** గత ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీలకు చేపట్టిన రంజాన్ తోఫా కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించటం హర్షణీయమని బిఆర్ఎస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్‌లు అన్నా రు. ఆదివారం మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ నవోదయనగర్ మసీదులో వారు ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ తోఫాలను అందచేసారు.



అన్ని మతాలను సమానత్వంగా చూడటం భారత దేశ సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు అలీ ముద్దిన్, సెక్రటరి నిసార్ అహ్మద్ గోరి, సలీం బాయ్, మాలా, అఫ్రోజ్, ఇమ్రాన్, ఫరూక్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనుల పూర్తికి వినతి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బాచుపల్లిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానందకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆగంరాజు మాట్లాడుతూ బాచుపల్లి 17వ డివిజన్ కౌసల్య కాలనీలో గ్రంథాలయ భవనం, ఎస్ఎన్‌డిపి నాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే పనులను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు రావాలని కోరారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్‌లో కొన్ని అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### దేశ యువతలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ

# క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

### డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ యువత లో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. క్రీడలను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా యువత అభివృద్ధి కోసం వినియోగించాలని, ఐపిఎల్ పేరుతో క్రీడాకారులను సంతలో సరుకుల్లా కొనుగోలుచేసే క్రీడా వ్యాపారాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సిగ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బిపిఎల్) క్రికెట్ టోర్నీ 4 రోజుల పోటీలను డాక్టర్ కె. నారాయణ,ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి మొలుగురం కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు, శిక్షణా కేంద్రాలు, క్రీడా సదుపాయాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. క్రీడలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు వాటిని కార్పొరేట్ లాభాల కోసం ఉపయోగించే విధంగా మారుస్తున్నాయన్నారు. భగత్ సింగ్ లాంటి విప్లవ వీరుల ఆశయాలు యువతకు ప్రేరణ కావాలని, క్రీడలు, విద్య, సామాజిక బాధ్యతల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడలను కూడా వ్యాపారంగా మార్చి బెట్టింగ్ యాప్స్, మాదకద్రవ్యాల సంస్కృతి యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడిన టిడిపి ఎంపి పుట్ట మహేష్‌ను సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. మొలుగురం కుమార్. మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సమస్యగా మారిందని, విద్యార్థులు, యువత అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యలో ముందుండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత కీలకభూమిక పోషించాల్సిన అవసరముందని, ఈ దిశగా యువతలో చైతన్యం కలిగించడానికి ఎఐవైఎఫ్ నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ అభినందనీయమని ఉప కులపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, రాజ్ కుమార్, మహేష్, భాను, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా నాయకురాలు సక్రి భాయి, హరీష్‌లతో పాటు 5 టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు.




# అభివృద్ధికి, సంక్షేమానికి వేదికలు.. కమ్యూనిటీ హాళ్లు

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అభివృద్ధికి, సంక్షేమానికి వేదికలుగా కమ్యూనిటీ హాళ్లు దోహదపడతాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్, పాండు బస్తీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ని ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు.

ఈ సందర్భం గా వివేక్ మాట్లాడుతూ గత పన్నెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కాలనీలు, బస్తీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలలో మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే తన బాధ్యతగా ముందుకువెళ్తున్నానని పేర్కొన్నారు. రాబోవు కాలంలో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, వారాల వినోద్, మహ్మద్ యూసుఫ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, బస్తీ వాసులు పాల్గొన్నారు.



**ఘనంగా కోటగుట్ట పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు...**

గాజులరామారం డివిజన్ చింతల్ చెరువు కట్టపై గల కోటగుట్ట పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఈ ఉత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు.

**ఘనంగా శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ, నాగదేవత ఆలయ వార్షికోత్సవ వేడుకలు...**

గాజులరామారం డివిజన్ శ్రీరాంనగర్ ఏలోని శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ, నాగదేవత ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ అమ్మవార్ల కృపా, కటాక్షలు ప్రజలందరి పై ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అంది పుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ మంజుల గౌడ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరి సురేష్, అనుటెక్స్ శ్రీనివాస్, జూలూరు శ్రీనివాస్, బిఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.





## ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/నవాబ్ పేట్ :** ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎల్లకొండ ఇందిరమ్మ హౌసింగ్ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం నవాబ్ పేట్ మండలంలోని ఎల్లకొండ గ్రామంలో గొల్లగూడెం శిరీష ఇందిరమ్మ ఇంటిని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పర్మయ్య, త్రివేణి, నాయకులు ప్రకాష్, శ్రీనివాస్, నర్సిములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తుందన్నారు. లబ్ధిదారులందనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరమేష్, జంగయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి


### సర్పంచ్ శోభపరమేష్ చారి

**ప్రజాపక్షం/నవాబ్‌పేట్ :** పారిశుద్ధ్య కార్మికులు గ్రామ పంచాయతీకి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని లింగంపల్లి సర్పంచ్ శోభపరమేష్ చారి అన్నా రు. 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఆదివారం లింగంపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్మికులకు సర్పంచ్ వడ్ల శోభపరమేష్ చారి ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా పరిశుభ్రత కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. వారు అంకితభావంతో పని చేస్తేనే గ్రామాలు ఆరోగ్యం గా, పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ అభివృద్ధికి, పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ప్రవీణ కుమార్, వార్డు సభ్యులు గౌతమి, పాండు, మల్లమ్మ, పాండురంగం, పావని బీమయ్య, గోవింద్ రెడ్డి, తలారి పాండురంగం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తుంపర్ల సేద్య పరికరాలు, కూరగాయల విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం /పరిగి :** రైతులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన పట్టు పారిశ్రామిక రైతులకి తుంపర్ల సేద్యం పరికాలు కూరగాయల విత్తనాల పంపణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గోని మాట్లాడుతూ ,రైతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత ,రాయితీ పద్ధతిలో పరికరాలు , విత్తనాలు అందించడం ద్వారా పంట ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మ కమిటి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుడుముల రజిత, కృష్ణ,యూనిష్,నరసింహలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా వార్షికోత్సవం వేడుకల్లో పాల్గొన్నా ఎమ్మెల్యే , పరిగి పట్టణం లోనిషిరిడి సాయిబాబా ఆలయంలో 22వ వార్షికోత్సవంతలో ఎమ్మెల్యే పాల్గోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవందర్ రెడ్డి, కౌన్సిలర్ రాధా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి బర్త్ డే వేడుకలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మాజి సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్ భర్త కమఠం కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం జరిగాయి. అలియాబాద్ మున్సిపల్ పరిదిలోని ఆన్య కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలకు జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు విచ్చేసి కేక్ కట్‌చేసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయంగా మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ ముజుబుద్దిన్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, ఎ బ్లాక్ అద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు తుంకి రమేష్, శామీర్‌పేట మాజి సర్పంచ్ కిషోర్‌యాదవ్, తూంకుంట మాజి సర్పంచ్ ఎద్దు నాగేష్‌యాదవ్, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మౌలాలి డివిజన్‌లోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అన్ని ప్రాంతాల నివాసితులకు తాగునీటి సమస్య లేకుండా చేసే లక్ష్యంగా జలమండలి ద్వారా బూస్టర్ ఏర్పాటు చేసామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్‌లో హనుమాన్‌నగర్ జడ్‌టిసి గ్రౌండ్ వద్ద రూ. 32 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజి సమస్య శాశ్వత పరిష్కార దిశగా రైల్వే అధికారులతో చర్చించి రైల్వే స్థలం మీదుగా డ్రైనేజీ మార్గానికి అనుమతి పొందటం ద్వారా ఈ పనులు పూర్తి కానున్నాయన్నారు. అదే విధంగా కెసిఆర్ బస్తీ, పిఎన్ఆర్ కాలనీ, నాన్నహిల్స్ వంటి ఎత్తైన ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబీకులకు బూస్టర్ ఏర్పాటు వల్ల ఇకపై మంచి నీటి సరఫరాలో సమస్య తలెత్తదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర సునీల్ కుమార్, డిజిఎం విద్యాసాగర్, బిఆర్ఎస్ శ్రేణులు అమీరుద్దీన్, మురుగేష్, ఇబ్రహీం, ఉస్మాన్, నవాబ్, తదితరులు పాల్గొన్నారు.




## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**ప్రజాపక్షం/పరిగి:** మండల పరిధిలోని జాపర్‌పల్లి గ్రామ సర్పంచ్ మహేష్ కుమార్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను వారి సేవలను గుర్తించి సన్మానించారు. గ్రామంలో 99రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సర్పంచ్ శాలువాకప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య పనుల నిర్వహణలో పరిశుద్ధ్య వర్కర్ల పాత్ర కీలకమైనదని, గ్రామాల్లో పరిశుద్ధ్యం మెరుగుపరచాలంటే కార్మికుల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలోని మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ నివాసంలో ఆదివారం మల్లన్న కల్యాణం కన్నుల పండువుగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు విచ్చేసి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతం మల్లన్న స్వామి దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్‌లు తుంకి బిక్షపతి, ఈగ శ్వేత నాగరాజు, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజి సర్పంచ్ ఎద్దు నాగేష్, జిల్లా నాయకుడు సాయిపేట శ్రీనివాస్, గోనె హన్మంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి బొంపల్లి గ్రామ సర్పంచ్


**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని బొంపల్లి బిఆర్ఎస్ పార్టీ సర్పంచు విజయపవన్ యాదవ్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని విశ్వసించి కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. గ్రామ అభివృద్ధికి నాయకులు విభేదాలు పక్కన పెట్టి అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి, అంతిరెడ్డి, సురేష్, మల్‌రెడ్డి, బాల్‌రాజ్, భాస్కర్,ఇతియాజ్ ఖన్ రమేష్, కృష్ణ,,అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండల పరిధిలోని నారేగూడ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బిఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాన్షీరాం మార్చి 15/1934న పంజాబ్ రాష్ట్రంలో జన్మించారని, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ పై తిరుగుతూ వ్యాప్తి చేశారన్నారు. అలాగే పూలే, సాహూ, మహరాజ్, నారాయణ గురు, పెరియర్ మహనీయుల ఆలోచన విధానాన్ని తెలియజేస్తూ బహుజనులకు రాజ్యాధికారం రావాలని ఏప్రిల్ 14/1984న బహుజన్ సమాజ్ పార్టీ ఏర్పాటు చేసి బెహన్ కుమారి మాయవతిని భారతదేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 1994 లో ముఖ్యమంత్రిని చేసి బహుజనులకు రాజ్యాధికారం ఇచ్చిన మహోన్నతమైన వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. మాన్య కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని నారేగూడ గ్రామంలో నాటినుండి ఏప్రిల్ 14 బాబాసాహెబ్ జయంతి వరకు భీమ్ దీక్షలు కొనసాగుతాయని నిత్య పూలమాల కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగ్యాడ పర్మయ్య, శేఖర్ రెడ్డి, శివరాజ్, శివకుమార్, దేవకుమార్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులే గ్రామ ఆరోగ్య ప్రధాతలు




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పారిశుద్ధ్య కార్మికులే గ్రామ ఆరోగ్య ప్రదాతలని దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. ఆదివారం దేవునిబండ తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక, 99రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు దేవి, చాంది, రాగ్య, మహేందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనునాయక్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంతున్న కార్మికులను సన్మానించుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్యామ్‌లాల్, పంచాయతీ కార్యదర్శి గీత, వార్డు సభ్యులు జాను, మారు, బాలాజీ, వాలి, శమంత, సుధాకర్, బి.శంకర్, ఈశ్వర్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**ప్రజాపక్షం/షాబాద్:** పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులను గ్రామ వార్డు సభ్యులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రణాళిక అనంతరం గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రియాజ్, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## దైవభక్తితో మనస్సుకు ప్రశాంతత



**ప్రజాపక్షం/కొత్తూరు:** దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని కుమ్మరిగూడలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో కడెంపల్లి శ్రీనివాస గౌడ్, బి.జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మాధవి గోపాల్ గౌడ్, మాదారం నర్సింహా గౌడ్, మాదారం క్రిష్ణ గౌడ్, బిక్షపతి, రమేష్, వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.10లతో మంజూరైన సిసిరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ సర్పంచ్ జోగు వజ్రమ్మప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జోగు వజ్రమ్మ మాట్లాడుతూ చౌలపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

## మహిళలతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ వెంకటయ్య వివరించారు. ఆదివారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులతోపాటు అంగన్‌వాడి, ఆశ వర్కర్లను పూలబాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 99రోజుల ప్రజాపాలనలో మహిళల సహకారం మరువలేనిదన్నారు. ( గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేయడంతోపాటు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉప సర్పంచ్ రమేష్, విఓఎ మొయినోద్దీన్, గ్రామ మహిళా సంఘం కార్యదర్శి లక్ష్మమ్మ, కోశాధికారి చిట్టెమ్మ, వార్డు సభ్యులు కె.రాజు. శంకర్‌నాయక్, లక్ష్మి యాదయ్య, సునీత విజేందర్, యాదమ్మ, ఆంజనేయులు, శేఖర్, దేవి, జంక తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్ర ప్రారంభం



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** కామినేని హాస్పిటల్ వైఎస్ఆర్ చౌరస్తాలో భగత్‌సింగ్ ఆటోస్టాండ్ కార్మికులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు, యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్య తేజ్ రెడ్డి, శ్యామల్‌రెడ్డి, రాజశేఖర్, మున్నా, జానీ, రాజు, విట్టల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసి ఇ-వేస్ట్ మెగా డ్రైవ్‌కు విశేష స్పందన

### రెండు రోజుల్లో 15 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సక్రమ నిర్వహణకు జిహెచ్‌ఎంసి చేపట్టిన ప్రత్యేక సేకరణ కార్యక్రమానికి పౌరుల నుంచి విశేష స్పందన లభించిందని అధికారులు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 14, 15 తేదీలలో నిర్వహించిన ఈవేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్‌లో నగరంలోని అన్ని 30 సర్కిళ్లలో కలిపి సుమారు 15 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించారు. పాత మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఛార్జర్లు, కీబోర్డులు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను పౌరులు పెద్ద సంఖ్యలో తీసుకొచ్చి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమం కోసం జిహెచ్‌ఎంసి పరిధిలో 110 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికారులు, స్వచ్ఛ సాథీ వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగర వ్యాప్తంగా జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ ఎన్.రవి కిరణ్ పర్యవేక్షించారు. ఇందిరా పార్కులో జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ అలీవేలు మంగతాయారు, సంబంధిత డిప్యూటి కమిషనర్లు పాల్గొన్నారు.

**పార్కుల్లో భారీ సేకరణ...** జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని జలగం వెంకటరావు పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో సుమారు 450 కిలోల ఈవేస్ట్ సేకరించారు. ఇందులో పాల్గొన్న పౌరులకు 4,500 రివార్డ్ పాయింట్లు అందజేశారు. అలాగే కవాడిగూడ సర్కిల్ పరిధిలోని ఇందిరా పార్క్ వద్ద 510 కిలోల ఈవేస్ట్ సేకరించగా, పాల్గొన్న పౌరులకు కలిపి రూ.20,874 నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ డ్రైవ్‌లో పౌరులు తీసుకొచ్చిన ఈ వేస్ట్ పరిమాణం ఆధారంగా రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారిక రీసైక్లింగ్ సంస్థలు అక్కడికక్కడే ప్రోత్సాహకాలు అందించడంతో పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిహెచ్‌ఎంసి నిర్వహించనున్న తదుపరి ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాలు వచ్చేనెల 11, 12, మే 9, 10 తేదీలలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇళ్లలో ఉపయోగం లేని ఎలక్ట్రానిక్ వస్తువులను సాధారణ చెత్తలో వేయకుండా, అధికారిక ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాల్లో అందజేయాలని జిహెచ్‌ఎంసి పౌరులను కోరింది. ఇలా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విలువైన పదార్థాలను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

## రూ.250 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా






### 2.34 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని రాంబాగ్ ప్రాంతంలో ఉన్న 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. సర్వే నెంబర్లు 354/1, 354/2, 354/3లో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ.250 కోట్ల వరకు ఉంటుందని అధికారుల అంచనగా ఉంది. ఈ భూమి చుట్టూ దేవాలయాలు ఉండగా, సమీపంలో సిక్కులకు చెందిన సమాధి కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఒక వర్గం దేవాలయాల కోసం భూమిని కేటాయించాలని కోరగా, మరో వర్గం సిక్కులకు ఇవ్వాలని స్థానికంగా కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఇరువర్గాలు తమతమ హక్కులను వాదిస్తూ వచ్చాయి. ఇటీవల సిక్కు మతస్థులు ఈ భూమిని తమకు కేటాయించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై సరైన నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జనవరి 29న జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశిస్తూ మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ సమయంలో సిక్కు వర్గానికి చెందిన వారు భూమి చుట్టూ టిన్ షీట్లతో ప్రహరీ నిర్మించి తమ ఆధీనంలోకి తీసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ విషయంపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాల ప్రతినిధులతో మాట్లాడి, సంబంధిత పత్రాలను పరిశీలించి, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భూమి ప్రభుత్వానికి చెందినదేనని నిర్ధారించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం టిన్ షీట్లతో నిర్మించిన ప్రహరీని తొలగించి, 2.34 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆస్థలం ప్రభుత్వభూమిదని పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. సిక్కుల సమాధి ఉన్న 366 గజాల స్థలాన్ని అలాగే ఉంచి, మిగతా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు తెలిపారు. హైడ్రా చర్యలను వారు అభినందించారు.


## 'ఆదిత్య' నిర్మాణాలపై క్రాస్ చెక్

### తహసీల్దార్‌కు లేఖ రాశాం, సమాధానం కోసం ఎదురుచూస్తున్నాం : హైడ్రా కమిషనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ నది గర్భంలోకి వెళ్లి ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలు చేపడుతున్నారనే అనుమానాలపై స్పష్టత కోసం గండిపేట్ తహశీల్దార్‌కు లేఖ రాసినట్లు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తెలిపారు. అయితే ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఆయన వెల్లడించారు. శాటిలైట్ చిత్రాలను పరిశీలించినప్పుడు డెమ్ నివేదికలో ఉన్న సందేహాల నేపథ్యంలో తహశీల్దార్‌కు లేఖ రాసినట్లు ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు చెప్పారు. మూసీ నది తీరంలో ఆదిత్య బిల్డర్స్‌కు ఇచ్చిన నిర్మాణ అనుమతులను గత ప్రభుత్వ కాలంలోనే రద్దు చేయగా, అదే నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించిందన్నారు. ఈ నిర్ణయంపై ఆదిత్య బిల్డర్స్ హైకోర్టును ఆశ్రయించగా, తాము బఫర్ జోన్‌లో కాకుండా వెనక్కి జరిగి నిర్మాణాలు చేపడుతున్నామని ఆధారాలతో కోర్టుకు వివరించినట్లు తెలిపారు. దీంతో హైకోర్టు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించిందని, ఆ శాఖలు సమర్పించిన నివేదికల ఆధారంగా కోర్టు నిర్మాణ అనుమతులను పునరుద్ధరించిందని చెప్పారు. ఆ తరువాతే ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు.

**ఆరోపణలను ఖండించిన హైడ్రా...** ఇలాంటి వాస్తవాలు ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్సీ కవిత హైడ్రాపై పలు ఆరోపణలు చేయడాన్ని సంస్థ ఖండించింది. హైకోర్టు అనుమతులు పునరుద్ధరించినప్పటికీ మరోసారి పరిస్థితిని నిర్ధారించుకోవాలనే ఉద్దేశంతోనే తహశీల్దార్‌కు లేఖ రాసినట్లు తెలిపింది. శాటిలైట్ చిత్రాల్లో నది గర్భంలోకి వెళ్లి ప్రహరీ నిర్మిస్తున్నట్లు అనుమానం రావడంతోనే రెవెన్యూ అధికారులను వివరణ కోరినట్లు పేర్కొంది. ఇదే విషయాన్ని గతంలో కూడా స్పష్టం చేసినప్పటికీ మళ్లీ ఆరోపణలు రావడంతో తాజా వివరణ ఇవ్వాల్సి వచ్చిందని హైడ్రా తెలిపింది.

## ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎమ్మెల్యే కృషి : విశాల



**ప్రజాపక్షం/కేశంపేట:** అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అడుగులు ముందుకు వేస్తున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్ పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినం సందర్భంగా బోకే ఇచ్చి విశాల శ్రావణ్‌రెడ్డి దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న శంకరన్నను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంధించాలన్న సంకల్పంతోనే షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించడం జరుగుతుందని తాండ్ర విశాల తెలిపారు.

## పకడ్బందీగా ఇండ్ల గణన కార్యక్రమం

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చార్జ్ అధికారులు (తహసీల్దార్ అండ్ మున్సిపల్ కమినర్లు), అదనపు చార్జి అధికారులకు (ఎంపిడిఒ అండ్ మేనేజర్స్) లకు జనాభా లెక్కలు 2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశ చేపట్టవలసిన ఇండ్ల గణన సబంధించి నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు గణన ప్రక్రియ ను నిర్వహిస్తారని, తమ మండల పరిధికి చార్జ్ అధికారులుగా తహసీల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని, అదేవిధంగా తమ మున్సిపల్ పరిధికి చార్జ్ అధికారులుగా సంబంధిత మున్సిపల్ కమిషనర్ మరియు అదనపు ఛార్జ్ అధికారులుగా మేనేజర్లు వ్యవహరిస్తారని తెలిపారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు. 15, 16, 17 రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సిపిఒ సౌమ్య, జెడ్ పి సిఇఒ సిహెచ్ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు

### మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** జన హృదయ నేత..ప్రజా ఆదరణ పొందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున జన్మదిన వేడుకల సంబరాలను ఘనంగా నిర్వహించారు. జన్మదినం పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించడం తోపాటు పూలబోకే చేతికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాల నుండి మండల పార్టీ అధ్యక్షులతోపాటు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున వారి నివాసానికి చేరుకొని టపాసులు కాల్చడంతోపాటు కేక్ కట్ చేసి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తొడ్పాటును అంధించినప్పుడే మానవ జన్మకు సార్థకథ లభిస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటికే వేల కోట్ల నిధులు తీసుకురావడమే కాకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించడం జరుగుతుందని వివరించారు. కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ముందుగా రూ.150కోట్లు మంజూరు చేయించడంతోపాటు మరో రూ.50కోట్లు సైతం మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. తనకు జన్మదిన వేడుకలు చేసుకునేందుకు ఇష్టం లేదని, కార్యకర్తల అభీష్టం మేరకు తాను చేసుకుంటున్నట్లు వివరించారు. నిరంతరం ప్రజా సేవకు తాను కట్టుబడి ఉంటానని, ఎవరికి ఏ కష్టం ఇచ్చినా తాను ముందుండి నడిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు మహ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, బాల్‌రాజ్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, మాణిక్యంతోపాటు బుద్ద నర్సింహులు, సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులతోపాటు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో...** షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని శాలువాతో సన్మానించి పూలబోకే అంధించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాశీనాథ్‌రెడ్డి. మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కండువా కప్పకుంటేనే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారా..ఎమ్మెల్సీ నవీన్

**ప్రజాపక్షం/కొందుర్గు:** పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడిని ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతుంటే..ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా కొనసాగుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర గ్రామంలో నిరుపేద క్రిష్ణయ్య ముదిరాజ్‌ను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అధికారులు నిర్మోహమాటంగా చెపుతుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడిని ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశిస్తుంటే స్థానికంగా మాత్రం అధికారులు కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఉన్న లీడర్లు చెప్పిన మాటలను అధికారులు నమ్మి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఎదిర గ్రామంలో ఆర్థికంగా ఉన్న వ్యక్తికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి నిరుపేదకు ఇవ్వకపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలో భాగంగా స్థానిక నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని చెప్పడం, ఇందుకు అధికారులు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలి..కానీ మండల పరిషత్ అధికారి ఏకంగా కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని లబ్దిదారుడు క్రిష్ణయ్యకు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే లిస్టులో అర్హులైన క్రిష్ణయ్య పేరు లేకుండా పెద్ద ఎత్తున ఎంపిడిఒ ఆఫీస్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, మహదేవ్‌పూర్ రవీందర్, సర్పంచ్ అనూష రవీందర్‌రెడ్డి, ఎదిర విజయలక్ష్మి , దామోదర్‌రెడ్డి, నాయకులు ప్రమోద్ పంతులు, ముష్టిపల్లి సర్పంచ్ జంగయ్య, నర్సింహ్మా, గోపాల్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



